జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 8-7-2025 శ్రీకాకుళం సంపుటి: 2 సంచిక: 390 పేజీలు: 4 వెల: రూ.7



# సిక్కోలు జీడిపప్పుకు.. జాతీయ గుర్తింపు



**✻14న న్యూఢిల్లీలో అవార్డు అందుకోనున్న జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ✻ హర్షం వ్యక్తం చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, జీడి రైతు సంఘాలు, వ్యాపారులు**

**శ్రీకాకుళం, జూలై 7 (వార్త):** శ్రీకాకుళం జిల్లా జీడిపప్పుకు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. రైతుల అకుంఠిత దీక్ష, అధికార యంత్రాంగం కృషి, పటిష్టమైన ప్రణాళికల ఫలితంగా వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ (ఓడిఓపి) కార్యక్రమంలో భాగంగా పలాస జీడిపప్పుకు 'జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు-2025' లభించింది. ఈ నెల 14న ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి అవార్డుల ప్రదానోత్సవంలో శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఉద్యాన అధికారి రత్నాల వరప్రసాద్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకోనున్నారు. ఇది కేవలం శ్రీకాకుళం జిల్లాకే కాకుండా, యావత్ ఆంధ్రప్రదేశ్ ఉద్యాన రంగానికి ఒక మైలురాయి అని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు చెందిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా అధికారులను అభినందించారు.

### జీడి మామిడి.. ప్రధాన జీవనాధారం..

శ్రీకాకుళం జిల్లాలో జీడి పంట అనేకమందికి ప్రధాన జీవనాధారంగా ఉంది. జిల్లాలో మొత్తం 24,000 హెక్టార్లలో జీడిమామిడి సాగు అవుతోంది. ఇందులో 22,000 హెక్టార్ల తోటలు దిగుబడినిస్తున్నాయి. పలాస, మందస, వజ్రపుకొత్తూరు, సోంపేట వంటి ఉద్దానం మండలాల్లో జీడిమామిడి విస్తారంగా సాగుచేయబడుతోంది. మేలైన సంకర జాతి రకాలైన బిపిపి-8,-6, వి-4 వంటి అధిక దిగుబడినిచ్చే రకాలు, స్థానిక వంశపారంపర్య జాతులు ఇక్కడ సాగులో ఉన్నాయి. ఈ పంట ద్వారా జిల్లాలో 1,05,000 కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనం సాగిస్తున్నాయి. వీరిలో 31,000 మంది సన్నకారు రైతులు, 56,000 మంది చిన్న రైతులు, 18,000 మంది పెద్ద రైతులు ఉన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఇచ్చే ఈ పంట రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందిస్తోంది.

### తిత్లీ తుఫాను నష్టం తర్వాత తిరిగి పుంజుకుని..


2018 అక్టోబర్‌లో వచ్చిన తిత్లీ తుఫాను జిల్లా ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం కలిగించింది. అయితే, ఈ విపత్తును ఒక అవకాశంగా మార్చుకొని ఉద్యాన శాఖ విస్తృత
పునరుద్ధరణ కార్యక్రమాలను చేపట్టింది. సుమారు 23 వేల ఎకరాల్లో పాత తోటలను పునరుద్ధరించడం, 7,500 ఎకరాల్లో అధిక దిగుబడినిచ్చే కొత్త జీడి తోటలను ఏర్పాటు చేయడం, అలాగే ఉపాధి హామీ పథకం ద్వారా మరో 7,500 ఎకరాల్లో సాగు విస్తరణ చేయడం వంటి చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి రూ.14.60 కోట్లు ఖర్చు చేయగా, రైతులకు సబ్సిడీ, సాంకేతిక సహాయం, శిక్షణ కార్యక్రమాల ద్వారా వ్యవసాయం తిరిగి ప్రాణం పోసుకుంది.

### ప్రాసెసింగ్ పరిశ్రమలకు ఊపు..

జీడి సాగుతో పాటు ప్రాసెసింగ్ పరిశ్రమల స్థాపనపైనా ఉద్యాన శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఎంఐడిహెచ్ / ఆర్కేవీవీ ద్వారా ఇప్పటివరకు 25 జీడిమామిడి ప్రాసెసింగ్ యూనిట్లను ఆధునీకరించి, సబ్సిడీ మంజూరు చేసింది. ప్రస్తుతం మరో 9 యూనిట్లకు నిధుల మంజూరు ప్రక్రియ కొనసాగుతోంది. ఇది పలాస ప్రాంతాన్ని జీడి పరిశ్రమల కేంద్రంగా మార్చేందుకు నూతన ఒరవడిని సృష్టిస్తోంది. ఎంఎస్ఎంఈ డే, కాజు ఎక్స్‌పో (పలాస) వంటి కార్యక్రమాల ద్వారా జిల్లాలోని రైతులు, వ్యాపారులు, ప్రాసెసర్లు తమ ఉత్పత్తులను దేశవాళీ, అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేసుకున్నారు. ఇది వారికి మార్కెట్ అవకాశాలను పెంచడంలో కీలక పాత్ర పోషించింది. ఆధునిక ప్యాకింగ్, శుభ్రతా ప్రమాణాలు, ఎగుమతి సౌలభ్యాలు కలిగిన ప్రాసెసింగ్ సెంటర్లు కూడా నిర్మించబడ్డాయి. సాధారణ జీడిపప్పుతో పాటు పుదీనా, చిల్లీ, పెప్పర్ వంటి సుగంధ ద్రవ్యాలు కలిపిన జీడిపప్పు, కాజు బర్ఫీ, వివిధ స్వీట్లు, చిక్కీలు, ఇతర చిరుతిళ్లు తయారు చేసే పరిశ్రమలు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లో ప్రాచుర్యం పొందాయి.

### శ్రీవారి సేవలో పలాస జీడిపప్పు..

తిరుమల తిరుపతి దేవస్థానంలో వెంకటేశ్వర స్వామి వారి ప్రసిద్ధ లడ్డు ప్రసాదం తయారీలో పలాస జీడిపప్పును వినియోగించడం, ఇక్కడి జీడిపప్పుకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి ఒక కారణమైంది. పలాస నుంచి ప్రతీ రోజు సుమారు 3000 కేజీల జీడిపప్పును స్వామివారి వివిధ ప్రసాదాల తయారీకి పంపిస్తున్నారు.



### జీడి రైతుల శ్రేయస్సు కోసం శిక్షణ

రైతులకు ఆర్థిక సహాయంతో పాటు సాంకేతిక శిక్షణ, ప్యాకింగ్ హౌసులు, శీతల గదులు, రైతుల సమస్యలకు సకాలంలో స్పందించే ఉద్యాన శాఖ సేవల ద్వారా ఆధునిక వ్యవసాయం, ధరల స్థిరత్వం, నష్ట నివారణ దిశగా అడుగులు వేసినట్లు అవుతుంది. ఉదాహరణకు, పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన కుత్తుమ వేమన్న అనే రైతు ప్యాక్ హౌస్, కొత్త టెక్నాలజీ ఉపయోగించి తన ఆదాయాన్ని రూ.7.6 లక్షల నుండి రూ.11.8 లక్షల వరకు పెంచుకున్నారు. ఇది జిల్లాలో మారుతున్న వ్యవసాయ విధానాలకు నిదర్శనం. ఉద్యాన శాఖ ద్వారా ఓడి ఓపీ ప్రాథమిక నివేదికను చేనేత, జౌళి శాఖ సహకారంతో అక్టోబర్ 2024లో సమర్పించగా, ఫిబ్రవరి 2025లో కేంద్రం నుంచి అధికార బృందం పలాస ప్రాంతంలో జీడి తోటలు, ప్రాసెసింగ్ యూనిట్లను విస్తృతంగా పరిశీలించింది. గౌరవ జిల్లా కలెక్టరు ఎప్పటికప్పుడు ఈ నివేదిక స్థితిగతులు తెలుసుకుంటూ అధికార యంత్రాంగానికి తగిన సూచనలు ఇస్తూ ముందుండి నడిపించారు. ఈ అవార్డు ద్వారా శ్రీకాకుళం జిల్లా పల్లెలో మొదలైన కృషి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఇది ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తోంది.

## ఏఎన్‌ఎంల ఆందోళన

**✻ డీఎంహెచ్‌వో కార్యాలయంలోనే బైఠాయింపు**

**✻ న్యాయం చేయాలని నినాదాలు**

**శ్రీకాకుళం, జూలై 7 (వార్త):** తమకు న్యాయం చేయాలని కోరుతూ ఏఎన్‌ఎంలు ఏకంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలోనే బైఠాయించి నిరసన వ్యక్తం చేసిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఏఎన్‌ఎంల బదిలీల్లో వైద్యఆరోగ్యశాఖ అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారని, ఉద్దేశపూర్వకంగానే ఖాళీలను బ్లాక్ చేసి, వాటిని చూపించకుండా జూమ్ కౌన్సెలింగ్ నిర్వహించారని ధ్వజమెత్తారు. మొక్కుబడిగా జాబితాలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు సమర్పించారని, బదిలీలపై ఫిర్యాదులు వచ్చినా విచారించలేదని వాపోయారు. జీవో-6కు అనుగుణంగా పారదర్శకంగా బదిలీలు చేసి, అక్రమాలపై విచారణ జరిపించి బాధ్యులను శిక్షించాలని, రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని పలువురు ఏఎన్‌ఎంలు నినాదాలు చేశారు. బదిలీల్లో జరిగిన అవినీతి, అక్రమాలతో నష్టపోయామని, తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.



## చైన్‌స్నాచింగ్ కేసులో ఇద్దరు అరెస్టు



**మెళియాపుట్టి, జూలై7 (వార్త):** రెండు వేర్వేరు కేసులకు సంబం ధించి బంగారం చోరీ చేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు పాత పట్నం సీఐ వి.రామారావు, మెళియాపుట్టి ఎస్ఐ పి.రమేష్‌బాబు తెలి పారు. మెళియాపుట్టి పోలీస్‌స్టేషన్‌లో వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2024 జనవరి 4వ తేదీన మెళియాపుట్టి మండలం జగన్నా థపురం గ్రామానికి చెందిన ఓటుకుల రాజేశ్వరి చెరువు వద్ద స్నానం చేసి వస్తుండగా మార్గ మధ్యలో ఆమె మెడలో పుస్తెలతాడును తెంపుకొని ద్విచక్ర వాహనంపై పారిపోయిన ఒక కేసు, గత నెల 29వ తేదీన మెళియాపుట్టి మండలం శేఖరపురం గ్రామం దగ్గరలో ముక్కుడి పోలమ్మ గుడి వద్ద నుండి పొలం పనులు ముగించుకొని అటుగా వస్తున్న నక్క శకుంతలమ్మ మెడలో ఉన్న పుస్తెలతాడును ద్విచక్ర వాహనంపై అటుగా వచ్చిన ముద్దాయిలలో ఒకరు తెంపబోగా పెనుగులాటలో సగం బంగారం తెంపుకొని వెళ్లిపోయిన కేసులకు సంబంధించి ముద్దాయిలు పట్టుకున్నా మన్నారు. సోమవారం జోడూరు గ్రామం వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో ఒడిశాకు చెందిన బాలకృష్ణ సాహూ, సుజిత్ కుమార్ పాడిలు అనుమానాస్పదంగా తిరుగుతుండగా వారిని పట్టుకొని విచారించగా తామే చైన్‌స్నాచింగ్ పాల్పడినట్టు తెలిపారన్నారు. వీరిని అరెస్టు చేసి పాతపట్నం కోర్టుకు తరలించామన్నారు. ఒంటరిగా ఉన్న ఇల్లును ఒంటరిగా వెళ్తున్న మహిళలను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతుంటారన్నారు. మీడియా సమావేశంలో పోలీసు సిబ్బంది మోజేశ్వరరావు, బాలకృష్ణ, సూర్యనారాయణ ఉన్నారు.

## 3 కిలోల గంజాయి స్వాధీనం

**పాతపట్నం:** అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఒడిశా రాష్ట్రం పూరీ జిల్లా చందనపూర్ పోలీసుస్టేషన్ పరిధి గడామృగశిర గ్రామానికి చెందిన రఘునాథ్ జెనా అనే వ్యక్తిని పాతపట్నం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 3.345 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ వి.రామారావు తెలిపారు. రఘునాథ్ జెనా ఒడిశా రాష్ట్రంలోని పూరీ తరలించేందుకు మూడు ప్యాకెట్లలో 3.345 కిలోల గంజాయిని బ్యాగులో పెట్టుకొని ఒడిశా నుంచి పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు నడుచుకుంటూ వస్తున్నాడు. అయితే దీనిపై ఎస్ఐ బి.లావణ్యకు ముందుగానే సమాచారం రావడంతో సోమవారం అతడిని పట్టుకున్నారు. అతడిని విచారించగా ఒడిశా రాష్ట్రంలోని మునిగూడ గ్రామంలో కార్తీక్ అనే గంజాయి వ్యాపారి వద్ద నుంచి 3.345 కిలోల గంజాయిని రూ.15 వేలకు కొనుగోలు చేసినట్లు వెల్లడించాడు. రైలులో పూరీ వెళ్లాలనే ప్రయత్నంలో పట్టుబడ్డాడని సీఐ తెలిపారు. మీడియా సమావేశంలో పాతపట్నం ఎస్ఐ బి.లావణ్య, ఏఎస్ఐ సింహాచలం, పోలీసులు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## రక్షిత నీటి పథకానికి శంకుస్థాపన

**నరసన్నపేట, జులై 7(వార్త):** నరసన్నపేట లోని దేశవానిపేట వద్ద 1,50,000 వేల నీటి సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ 53 లక్షల రూపాయల నిర్మిస్తున్న రక్షిత మంచినీటి పథకానికి కొబ్బరికాయ కొట్టి ఎమ్మెల్యే బగ్గ రమణమూర్తి, నియోజకవర్గ సమన్వయ కర్త బగ్గ అర్చన ప్రారంభించారు. కార్యక్రమంలో క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జిలు, సర్పంచ్లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బోర్డు పెట్టి..ఫొటో కొట్టి ..ఆక్రమణ

- కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన
- ప్రశ్నించే వారిపై దౌర్జన్యం
-రెవెన్యూ హెచ్చరిక బోర్డుల సైతం తొలగింపు
-చర్యలకు వెనుకాడుతున్న అధికారులు

**ఆమదాలవలస, జులై7(వార్త):** ప్రభుత్వ భూమైనా, ఇంకేదైనా ఆక్రమణకు అడ్డంకేమీ లేదని నిర్వాసితుల భూమిని ఆక్రమించిన ఘనుడు జొన్నవలస గ్రామానికి చెందిన ఓ వ్యక్తి. ఈయన చేస్తున్న అక్రమలను ప్రశ్నిస్తే తిరుగుబాటు. కోర్టు ఆదేశాలతో ప్రభుత్వం హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేసినా.. కొంతకాలం వాటిని ఉంచి గ్రామస్తులను ఏ మార్చి..పంట కాలం వచ్చేసరికి వాటిని తొలగిస్తూ యదేచ్ఛగా ఆక్రమణ చేస్తున్నారు. కోర్టు ఆదేశాలతో జిల్లా ఉన్నతాధికారి స్థానిక రెవెన్యూ అధికారులు స్పందించి రెండవసారి కూడా హెచ్చరిక బోర్డును ఆ భూముల ఏర్పాటు చేశారు. ఆమదాలవలస మండలం చిన్న జొన్నవలస గ్రామం రెవెన్యూ లో ప్రభుత్వం ఆర్అండ్ఆర్ నిర్వాసితుల కొరకు రైతుల నుంచి భూములు సేకరించి కొనుగోలు చేసింది. నిర్వాసితులకు కేటాయించిన స్థలము సర్వేనెంబర్ 121-20 భూమిని చిన్న జొన్నవలస గ్రామానికి చెందిన రెడ్డి రాజులు వారి కుమారులు నర్సింగరావు రెడ్డి అప్పారావు అనే వ్యక్తులు ప్రభుత్వ స్థలమును ఆక్రమించుకొని వరి పంట వేశారు. నిర్వాసితుల కోసం భూమిని అందించిన రైతు జిల్లా ఉన్నతాధికారులకు ఆక్రమణ పై ఫిర్యాదు చేశారు. ఆ స్థలంపై ఉన్న ఆక్రమణ తక్షణం తొలగించాలని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును ఆ స్థలంలో ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారులను నమ్మించిన ఆక్రమణదారుడు వెను వెంటనే ఆ బోర్డును తొలగించి తిరిగి ఆ స్థలాన్ని తన అధీనంలోకి తీసుకున్నారు. ఈ స్థల వివాదంపై పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ నమోదై ఉంది. ఆటు అధికారులను ఇటు గ్రామస్తులను ధిక్కరించి యథేచ్ఛగా స్వాధీనం చేసుకున్నప్పటికీ చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేసిన ఫొటోలు.. ఉన్నతాధికారులవెళ్లిన వెంటనే ఆక్రమణదారుడు బోర్డును తొలగిస్తున్నారు. ఇలా రెండుసార్లు జరిగింది. అంటే రెవెన్యూ అధికారులతో ఆయనకు ఉన్న సంబంధం అటువంటిదని తెలుస్తుంది. అధికారులు ఆక్రమణదారులకు సహకరించేందుకు కొంత మొత్తాన్ని అందించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ నిర్వాసితులకు కేటాయించిన స్థలంలో ఆక్రమణలు చేయటం ప్రభుత్వం తరపున చర్యలు చేపట్టకపోవడం వెనుక కారణాలను గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.



ఆక్రమణ స్థలంపై హెచ్చరిక బోర్డు పెట్టిన రెవెన్యూ సిబ్బంది



హెచ్చరిక బోర్డును తొలగించిన చిత్రం

పత్రికల్లో కథనాలు వచ్చినప్పటికీ రెవెన్యూ అధికారులు ఆక్రమణదారుడుపై చర్యలు తీసుకొనటంలో ఎందుకు మౌనం పాటించుచున్నారు? ఈ మౌనం వెనుక అక్రమణదారుడుకు సహకరించుటకా ,,? ఆక్రమణదారుడు ప్రలోభాలకు లోపాయికారీ ఒప్పందమా? ఆక్రమణదారుడు ప్రభుత్వ బోర్డులను తొలగించి అధికారులను ధిక్కరించి దౌర్జన్యముగా ప్రభుత్వ భూమిని ఆక్రమించి యతెచ్ఛ గా సాగు చేస్తున్నాడంటే, చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారంటే రెవెన్యూ అధికారులకు తనకు ఉన్న సంబంధం ఎటువంటిదో తెలుస్తుందని ప్రజలు గుసగుసలాడుతున్నారు? లేదంటే చర్యలు ఏవని గ్రామ ప్రజలు నిర్వాసిత ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఇలాంటి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



### ఎంఎల్ఏ గౌతు శిరీష చొరవతో..
## మురిపిండి చెరువుకు మోక్షం

**మందస, జులై 7(వార్త):** మందస మండలంలోని బాలిగాం గ్రామం వద్ద గల మురిపిండి చెరువుకు ఎంతో ప్రాధాన్యత ఉంది. బాలిగాంతో పాటు హరిపురానికి కూడా ఈ చెరువు ఉపయోగపడుతోంది. ఎన్నో ఏళ్లుగా మురిపిండి చెరువు మరమ్మత్తులకు నోచుకోకపోవడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష ప్రతి చేనుకు నీరు, ప్రతి చేతికి పని అనే సంకల్పంతో అన్నదాతను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రణాళికలు తయారు చేసుకున్నారు. మఖరజోల లెవెల్ నుండి బాలిగాం గ్రామం మురిపిండి చెరువు కాలువ గత ఐదు సంవత్సరాలుగా ఎటువంటి మరమ్మతులకు నోచుకోగా ముళ్ల పొదలతో, పూడికతో నిండిపోయి కాలువలో కనీసం సాగునీరు పారే అవకాశం కూడా లేకపోవడంతో ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాలతో మురిపిండి చెరువు సాగునీటి కాలువ పనులు ప్రారంభించారు. దీని పరిధిలో మూడు చెరువులు సుమారు 780 ఎకరాల సాగు భూమికి కాలువ శుభ్రం లేకపోవడంతో గత ఐదేళ్లుగా వరి చేలు సగంలోనే ఎండిపోయే పరిస్థితి దాపురించింది. ప్రతి చేనుకి నీరు అందించాలని సంకల్పంతో మా సొంత నిధులతో ఈ కాలువలో ప్రోక్లైనర్ పెట్టి బాగు చేయడం జరుగుతుందని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన చెప్పారు. కాగా నిర్ణీత సమయం కంటే ముందుగానే పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు వంశధార నీరు అందిస్తున్నందుకు రైతాంగం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, బావన ఢిల్లేశ్వరరావు, గున్న శ్రీనివాస్, గున్న రఘుపతి, గున్న విక్రమ్, పొందూరు అశోక్, బెందాలం షణ్ముఖరావు, మాదిన శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


## సర్పంచ్ వెంకటరావుకు సీదిరి పరామర్శ



**మందస, జులై 7(వార్త):** మందస మండలంలోని మూలిపాడు సర్పంచ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు గుసిరి వెంకటరావు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సోమవారం ఆయనను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అప్పలరాజు డాక్టర్ కావడంతో వెంకటరావు అనారోగ్యానికి గల కారణాలు వివరంగా తెలుసుకుని, తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆర్యోగం విషయంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆయనతో పాటు ఎంపీపీ డొక్కరి దానయ్య, సర్పంచ్ దుంపల వైకుంతరావు, మందస ఎంపీటీసీ కంచి బెహరా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సొర్ర ఢిల్లేశ్వరరావు, బత్తిని లక్ష్మణ్, బమ్మిడి సంతోష్ కుమార్, గొరకల కేశవరావు, దున్న హరికృష్ణ, పులారి పితాంబరం, తిమ్మల కృష్ణ, గుంపు జగదీష్ తదితరులు ఉన్నారు.

## పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరి

**మందస, జులై 7(వార్త):** ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా మందస, హరిపురం పశు వైద్యశాలలో డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ కిల్లి ఉమభారతి ఆధ్వర్యంలో పెంపుడు జంతువులకు(కుక్కలు) ఏంటిరేబిస్ టీకాలను వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జంతువులనుండి మనుషులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అంటారని, ఈ వ్యాధుల నివారణకు ప్రజలు వీటిపట్ల అవగాహన పెంచుకొని ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలన్నారు. వీటి నివారణ పట్ల చైతన్యవంతులను చేసేందుకు ప్రపంచవ్యాప్తంగా జులై 6వ తేదీన ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్నారు. దాదాపు 190 రకాల వ్యాధులు జంతువులనుంచి మనుషులకు సోకుతాయని, ఇళ్లల్లో పెంపుడు జంతువులను పెంచుకొనేవారు జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధులు గురించి తెలుసుకొని, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను పాటించాలన్నారు. అనంతరం హాస్పిటల్ కు తీసుకువచ్చిన పెంపుడు జంతువులకు ఏంటిరేబిస్ టీకాలను వేయడం జరిగింది. కార్యక్రమంలో సిబ్బంది సీహెచ్ ప్రసన్న, అనూష, బాలకృష్ణ, హరికృష్ణ, శ్రీను, కళ్యాణ్ కుమార్, లక్ష్మి, పార్వతి, రాజ్యలక్ష్మి, ఉమా, మురళి, కూర్మారావు, తిరుపతి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



# అర్జీలు పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలి

-కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
-60 అర్జీల స్వీకరణ



**శ్రీకాకుళం, జులై 7(వార్త):** అర్జీలు పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో ఆయన అర్జీదారుల నుంచి జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ పై అందరు దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. స్వీకరించిన అర్జీలలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, డ్వామా, మహిళా శిశు సంక్షేమం, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పంచాయతీ, సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా విద్యాశాఖ, డిసిహెచ్ ఎస్, ఎపిఈపీడిసియల్, గృహ నిర్మాణ శాఖ, సర్వే అండ్ లాండ్ రికార్డులు, వ్యవసాయం, దేవదాయ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, ఆర్డబ్ల్యుఎస్, తదితర శాఖల సమస్యల పై 60 అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరణలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్, జడ్పీ సీఈవో ఎల్ఎన్ వి శ్రీధర్ రాజ ఉన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఐఐటీ విద్యార్థులను అభినందించిన కలెక్టర్

**శ్రీకాకుళం, జులై 7(వార్త):** మరింత ఉన్నత శిఖరాలను అందుకోవాలనే జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఐఐటిలో ర్యాంకులు సాధించిన పల్లా భరత్ చంద్ర, బి. రోహిత్ దత్ లను అభినందించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ లు ఘనంగా సన్మానించి అభినందించారు. ఐఐటిలో ఆల్ ఇండియా 21వ ర్యాంకు సాధించి ముంబాయి ఐఐటి సి.ఎస్.సీ లో సీటు సంపాదించినట్లు పల్లా భరత్ చంద్ర కలెక్టర్ కు వివరించారు. తెలంగాణ ఎంసెట్ లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. పల్లా భరత్ చంద్ర తండ్రి పల్లా రామకృష్ణ చింతపల్లి వద్ద మెరైన్ పోలీస్ స్టేషన్, తల్లి అధికారి దమయంతి, పంచాయతీ కార్యదర్శి బెల్లమాంలో పనిచేయుచున్నారు. కలెక్టర్ సన్మానించి అభినందించారు. బాగా చదువుకొని మరింత ఉన్నత శిఖరాలను అందుకోవాలన్నారు. మెయిన్స్ లో ఆల్ ఇండియా 256వ ర్యాంకు సాధించిన మరో విద్యార్థి బి. రోహిత్ దత్ ను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ లు సన్మానించి అభినందించారు.



గౌహుతి ఐఐటిలో సి.యస్.సి. సీటు వచ్చినట్లు కలెక్టర్ కు వివరించారు. తండ్రి బివియస్ సాయిరాం, ప్రధానోపాధ్యాయులు, అమలపాడు, వజ్రపుకొత్తూరు మండలంలో పని చేస్తున్నట్లు చెప్పారు. తల్లి సిపిఓ లక్ష్మీ ప్రసన్న అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్, జడ్పీ సీఈవో ఎల్ఎన్ వి శ్రీధర్ రాజ, తదితరులు ఇద్దరు విద్యార్థులను అభినందించారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఫిట్‌నెస్ సెంటర్ మార్చే వరకు ఉద్యమం ఆగదు



**ఇచ్ఛాపురం, జులై 7(వార్త):** జిల్లా లో 130 కిలోమీటర్లు దూరంలోఎచ్చెర్ల లో ఉన్న ఆటో ఫిట్ నెస్ సెంటర్ ఇచ్ఛాపురం నకు సమీపంలో కి తరలించే వరకు ఉద్యమం ఆగదని ఏ ఐ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి వామన మూర్తి డిమాండ్ చేశారు.స్థానిక యూనియన్ కార్యాలయంలో సమావేశం జరిగింది. 60 కిలోమీటర్లు లోపు ఫిట్ నెస్ ఏర్పాటు చేయాలని,ఇన్సూరెన్స్ అమలు చేయాలని,ట్రాఫిక్ జి వో రద్దు చేయాలని అన్నారు.ఈ సమావేశంలో అధ్యక్షులు బి మోహన్,పి .హరి,పి తిరుమల,వి.దుర్యోధన, ఉలాసి ఎర్రయ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రోడ్లు, కాలువలు ప్రారంభం

**ఆమదాలవలస, జులై 7(వార్త):** ఆముదాలవలస మండలంలోని ఎస్ఆర్‌సీ పేట గ్రామంలో రూ.కోటి 3 లక్షల రూపాయలతో నిర్మించిన రోడ్లు , కాలువలను సోమవారం ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రారంభించారు. రైతన్నలకు ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న పశువుల దాణా పంపిణీ చేశారు.

## శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి



**మందస, జులై 7(వార్త):** అఖండ భారతదేశం కోసం బలిదానం చేసుకొన్న మొట్టమొదటి దేశభక్తుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి మందసలో జరిగింది. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలు కొనియాడారు. ఆయన ఆశయాలను మనమంతా ముందుకు కొనసాగించాలని మందస మండల బీజేపీ అధ్యక్షుడు తెలుకుల సురేష్, ఓబీసీ మోక్ష జిల్లా కార్యవర్గ సభ్యుడు రౌతు చిరంజీవిరావు అన్నారు. కార్యక్రమంలో ఓబీసీ కిసాన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ రట్టి లక్ష్మణ్ కుమార్, ఓబీసీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ పున్నయ్య, పట్నాయక్, బాలకృష్ణ, నిరంజన్ మహరణ, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధ్యతగా పనిచేయండి



**పలాస, జులై 7(వార్త):** ఏ ప్రాంతంలో పనిచేసిన బాధ్యతగా పనిచేయాలని ఉద్యోగులను పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు కోరారు. సాధారణ బదిలీలలో భాగంగా పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘము నుండి ఇచ్ఛాపురం, శ్రీకాకుళం, రాజాం పురపాలక సంఘములకు బదిలీలపై వెళుతున్న సచివాలయ కార్యదర్శులకు రిలీవింగ్ ఉత్తర్వులు సోమవారం తన కార్యాలయంలో కమిషనర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో బదిలీలు సాధారణంగా జరుగుతుంటాయని, ఏ ప్రాంతంలో ఎక్కడ పనిచేసిన బాధ్యతగా పనిచేయాలని చూపించారు. పై అధికారుల అభిమానం, మనసా పొందాలని తెలియజేశారు. బదిలీపై వెళ్తున్న ఉద్యోగులు ఆ ప్రాంతంలో ప్రజలకు సేవ చేయాలని, ఆ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. ఎక్కడ పని చేసినా ప్రాంతానికి అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రజల సహకారం ఉంటే ఆ ప్రాంత అభివృద్ధిని సులవుతుందని చెప్పారు. విధి నిర్వహణలో ఇటువంటి ఆటంకాలు ఏర్పడిన ఆ ప్రాంత ప్రజల అండతో ఎదుర్కోవాలని చెప్పారు.

## ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకరించండి

**ఇచ్ఛాపురం, జులై 7(వార్త):** స్థానిక అలయన్స్ క్లబ్ అధ్యక్షులు లోపింటి నంసింహమూర్తి, సభ్యులు పట్టణ సబ్ ఇనస్పెక్టర్ ముకుందరావుకు ట్రాఫిక్ సమస్యలు, మైనర్ డ్రైవింగ్, ఒకే వాహనంలో ఇద్దరికంటే ఎక్కువ మంది ప్రయాణించడం, మితిమీరిన వేగంగా ప్రయాణించడం, వాహనాల ధ్వని, వాయు కాలుష్యాలు, ఈవ్‌టీజింగ్ ఇతర సమస్యల నివారణకు కృషి చేయాలని కోరారు. చైతన్య సదస్సు, ర్యాలీ లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలలో ట్రాఫిక్ నిబంధనలు మీద అవగాహన కల్పించే కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లుయిన తమ వంతుగా ఆయా కార్యక్రమాలలో పాల్గొని తోడ్పాటు అందించగలమని తెలి పారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు జి.ఉమాశంకర్, సభ్యులు బుజ్జి, యోగి, ఎల్. వెంకటరావు, బాలకృష్ణ, బబ్బుల, రఘు, వై.బాల, పి.ఆర్.ఓ డి.గోపి, కాళ్ల నంసింహ తదితరులు పాల్గొన్నారు.



## ఎయిర్‌పోర్ట్ నెపంతో స్థిరాస్తుల పైకి వస్తే సహించం



**మందస, జులై 7(వార్త):** కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణం నెపంతో ప్రభుత్వ అధికారులు కానీ ప్రైవేటు కంపెనీ కానీ రైతుల స్థిరాస్థి భూముల పైకి వస్తే మాత్రం ఇక సహించేదిలేదని కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు గట్టిగా హెచ్చరించారు. కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాట కమిటీ కన్వీనర్ కొమర వాసు ఆధ్వర్యంలో మందస మండలంలోని రాంపురం సచివాలయం రాంపురం, మీల గంగువాడ, తెలగ గంగువాడ ఎదుట నిరసన బాధిత రైతులు తెలిపారు. భూములు మాకు తరాతరాల ఆస్తి అని, వాటిని నమ్ముకుని సంతోషంగా జీవిస్తున్నామన్నారు. అలాంటిది రైతుల అనుమతి లేకుండా ఇక్కడ మాకు అవసరం లేని ఎయిర్ పోర్ట్ వంటి నిర్మాణాలు చేపడితే దానికి వ్యతిరేకంగా ఎంత వరకు అయినా వెళ్తామని బాధిత రైతులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు పచ్చని మా భూములు జోలికి రాకుండా ఎక్కడైనా ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఉంటే అక్కడ నిర్మాణాలు చేసుకోవాలని, ఈ విషయంలో గత కొద్దీ నెలలుగా చేస్తున్నటి వంటి మా ఉద్యమానికి స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష, కేంద్ర పౌరవిమానాయన మంత్రి రామ్మోహన్నాయుడు, జిల్లా కలెక్టర్, పలాస ఆర్డీఓ సానుకూలంగా స్పందించి, రైతులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్త గున్నయ్య, పొట్టి ఎర్రయ్య, బత్తిని లక్ష్మణ్, మర్ల జనార్ధన, దున్న రామారావు, దున్న సింహాచలం, నల్ల పరశురామ్, గుంటు లోకనాథం, దున్న పీతంబరం, దున్న సురేష్, జుత్తు భోగమ్మ, తమాడ జానకమ్మ, దున్న లక్ష్మమ్మ, దున్న దుర్గమ్మ, తమాడ నూకాలమ్మ, దున్న గున్నమ్మ, దున్న రోహినమ్మ, పెద్ద ఎత్తున బాధిత రైతులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న లక్ష సంతకాల సేకరణ..

కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం కొనసాగుతోంది. మందస మండలంలోని రాంపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు దున్న రామారావు నేతృత్వంలో కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేకంగా రైతులు సంతకాల సేకరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళ రైతులు మాట్లాడుతూ సమాజంలో అన్ని సమస్యలకు అభివృద్ధే పరిష్కరమార్గామా? అదే నిజమైతే మన పాలకులు చెబుతున్న అభివృద్ధి అందరకీ తారకమంత్రం అయ్యేదన్నారు. మాటలకు, చేతలకు పొంతనలేని కార్గో ఎయిర్ పోర్ట్ అభివృద్ధి ప్రజల్లో అనేక ప్రశ్నలు, అనుమానాలని రేకెత్తిస్తోందన్నారు. సమస్యలకన్నా ముందు ప్రజలు అడుగుతున్న మౌలిక ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన పాలకులు అన్నింటికి అభివృద్ధే జవాబని బదులిస్తున్నారన్నారు. ప్రజల భాగస్వామ్యంతో సంబంధం లేకుండా జరిగే కార్గో ఎయిర్ పోర్ట్ ప్రక్రియను అభివృద్ధి అనగలమా అని ప్రశ్నించారు. ఎవరికి నచ్చిన రాజకీయ పార్టీకి వాళ్ళు మద్దతు ఇచ్చికోండి కానీ, ఉద్దానం భూముల్ని మాత్రం ఇవ్వకూడదని, మనందరి మాట ఒకటే మనందరి పోరాటం ఒక్కటే మనందరి పార్టీ ఒక్కటే అదే భూ బాధితల పార్టీ అన్నారు. కార్యక్రమంలో తామాడ తుంభనాదం, మర్ల జనార్దన రావు, దున్న జోగారావు, జుత్తు కోదండరావు, మర్ల వేమయ్య, కీలు ముఖలింగం, కీలు కాంతారావు, మర్ల సంతోష్, జుత్తు భూపతి, గ్రామ కమిటీ సభ్యులు, బాధిత రైతులు మహిళలు పాల్గొన్నారు.

## 10న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్



**శ్రీకాకుళం, జులై 7(వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 10న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రతీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలు మొదటి, రెండవ సంవత్సరాలకు సంబంధించి విద్యార్థులు, తల్లిదండ్రులు సమావేశానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. యాజమాన్యాలకు తెలియజేసినట్లు వివరించారు. సమావేశంలో విద్యార్థులకు గత యేడాది ఏమి చేశాము ఈ విద్యా సంవత్సరంలో ఏమి చేయబోతున్నాము అనే అంశాలపై విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే ప్రణాళిక పై చర్చిస్తారన్నారు. విద్యార్థులకు విద్యకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా సమావేశంలో తెలియజేసుకోవచ్చున్నారు. సమస్యలు ఉన్నట్లయితే సమస్యలు పై దృష్టి సారించాలని టీచర్లకు తెలియజేయాలన్నారు.


గ్రీన్ పాస్పోర్ట్ మొక్కలు నాటు కార్యక్రమం ప్రారంభమైనదన్నారు. ఏక్ పేర్ మాగీనామ్ కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ నుండి మొక్కలు సరఫరా చేస్తారన్నారు. ప్రతీ విద్యార్థి పాఠశాల లేదా కళాశాల ఆవరణలో లేదా గృహాల వద్ద మొక్కలు నాటాలని, మొక్క నాటడంతో పాటు ఆరు నెలల పాటు మొక్క సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఇప్పటికే సూచనలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అదే రోజు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పేరెంట్స్, టీచర్స్, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు అందరూ వస్తే ఒక పండగ వాతావరణంలో కలసి భోజనం చేద్దామన్నారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఘనంగా నిర్వహిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోవాలని ఆయన కోరారు.

### శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సొసైటీకి అవార్డు

శ్రీకాకుళం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అవార్డు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఆర్ అండ్ బి బంగ్లా వద్ద రెడ్ క్రాస్ సొసైటీ చాప్టర్ ఉందని, పి. జగన్మోహన రావు ఆధ్వర్యంలో యూనిట్ ఉందన్నారు. మన జిల్లాకు అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. రక్త దానం కు ఎప్పుడైనా పిలుపునిస్తే అవకాశం ఉన్న వారు రక్తం దానం చేయాలని కోరారు. రక్త దానం చేయుటకు తలసేమియా పేషెంట్స్ రెడ్ క్రాస్ సొసైటీ కైనా లేదా రిమ్స్ కైనా వెళ్ల వచ్చున్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేయనున్నట్లు పేర్కొంటూ ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్, జడ్పీ సీఈవో ఎల్ఎన్ వి శ్రీధర్ రాజ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నెల రోజుల్లో రైల్వే ఓవర్ బ్రిడ్జికి టెండర్లు

**ఇచ్ఛాపురం, జులై 7(వార్త):** ఈస్ట్ కోస్ట్ రైల్వే భూవనేశ్వర్ లో చీఫ్ ఇంజనీర్ ఆఫీస్ లో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి హెచ్ విక్టర్ జోసెఫ్‌ను జడ్ అర్ యు సి సి సభ్యులు శ్రీనివాస్ రంగా రౌలో కలిసి ఇచ్ఛాపురం లో మంజూరు అయిన రోడ్ ఓవర్ బ్రిడ్జి పనులు తక్షణమే పనులు ప్రారంభించాలని కోరారు ఇంజనీరింగ్ అధికారాలు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవలే రత్తకన్న గేట్ వద్ద ట్రాఫిక్ జములో అంబులెన్సు ఇరుకపోవడం స్థానికులు తన దృష్టిలో తేవడం వలన చీఫ్ ఇంజనీర్ ఆఫీస్ కి వెళ్లి కలిసి నట్లు చెప్పారు. బ్రిడ్జి అనుమతులు అన్ని వచ్చేసాయి, డిసైన్ అప్రూవల్ టేకింగ్ చేసాం, నెల రోజులు టెండర్ లు పూర్తి చేసి పనులు ప్రంభిస్తాం అని హామీ ఇచ్చారని శ్రీనివాస్ రౌలో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యులు సదానంద రౌలో పాల్గొన్నారు.



## ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**-ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి**

**-72 వినతుల స్వీకరణ**



**శ్రీకాకుళం, జులై 7(వార్త):** ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార కార్యక్రమంలో(పబ్లిక్ గ్రీవెన్స్) లో స్వీకరించే ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కారం చూపి, బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి 72 మంది నుంచి పిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ స్వయంగా వృద్దులు, దివ్యాంగులు అర్జీ దారులు తో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఫిర్యాదు దారుల అర్జీలు,వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ (ఫోన్ ద్వారా) లో తక్షణమే సంబధిత పోలీసు అధికారులకు తెలియ పరిచి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు.ప్రజా పిర్యాదులు పట్ల అత్యంత ప్రాధాన్యత ఇస్తూ,నిర్లక్ష్యం వహించ కుండా త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఎస్పి గారు అధికారులు ఆదేశించారు. పిర్యాదులు వివరాలు మొత్తం 72 స్వీకరించారు.అందులో కుటుంబ సమస్యలు,భార్య భర్తలు గొడవలు, మోసపూరితమైన,ఆస్తి తగాదాల, సివిల్, ఇతరత్రా అంశాలపై స్వీకరించారు

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# 10న టెలిగ్రాఫ్ సంఘ మహాజన సభ

**శ్రీకాకుళం, జులై 7(వార్త):** ఈనెల 10వ తేదీన నిర్వహించనున్న ది టెలిగ్రాఫ్ ఎంప్లాయిస్ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ మహాజన సభకు సభ్యులందరూ హాజరు కావాలని సబ్ డివిజన్ కోపరేటివ్ అధికారి ఎం. చంటి బాబు ఒక ప్రకటనలో కోరారు. ఉన్నతాధికారులు తనకు లిక్విడేషన్ అధికారిగా నియమించినందున, సంఘం యొక్క ఆస్తి అప్పులకు సంబంధించి నోటీసులు జారీ చేసి క్లయిములను పరిష్కరించడం జరిగిందన్నారు. కావున సంఘం యొక్క లిక్విడిటి పూర్తి చేయటకు వీలుగా ఈ నెల 10 వ తేదీన జరుగు మహా జన సభకు సభ్యుల%శీ%దరూ హాజరై చర్చించాలని వివరించారు.

**నరసన్నపేట, జులై 7(వార్త):** కూటమి ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి గారు తెలిపారు. నరసన్నపేట పట్టణంలో కళాసి కాలనీ,వీర నాయుడు కాలనీ ,లప్పర్స్ కాలనీ ప్రాంతాలలో ప్రజలను ఎమ్మెల్యే గారు కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రతి ఇంటిలో కూడా ఒక సంక్షేమ పథకం తప్పనిసరిగా అమలు జరిగే విధంగా పాలన కొనసాగుతుందని వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన గారు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జిలు,



సర్పంచ్లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**ఇచ్ఛాపురం, జులై 7(వార్త):** కూటమి ప్రభుత్వం హయాంలో సుపరిపాలన అందుతుందని ప్రభుత్వ విప్ బెందాలం అశోక్ అన్నారు. సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బలరామపురం గ్రామంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు లోపింటి పద్మనాభం,దక్కత ఢిల్లీ రావు, దాసరి రాజు, కొండ శంకర్ ,సాడి సహదేవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మున్సిపాలిటీ పరిధి మూడో వార్డు లో జరిగిన కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శి లు పత్రి తవిటయ్య, నందిగం కోటి, సాలీనా ఢిల్లీ తదితరులు పాల్గొన్నారు.మండలం ధర్మపురం, కొఠారి లలో సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు లోపింటి పద్మనాభం, దక్కత ఢిల్లీ రావు,సాడి సహదేవ్ రెడ్డి, కామేశ్వరరావు, కుర్మారావు,దుర్యోధన, బాబ్జి,పరశురాం,మాధవ రావు, లోహిదాస్, శంకరరావు,చంద్రశేఖర్, సారధి,నాగరాజు,ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.





**మెళియాపుట్టి, జులై 7(వార్త):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ముక్తాపురం గ్రామంలో సోమవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు..ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రతి ఇంటిలో కూడా ఒక సంక్షేమ పథకం తప్పనిసరిగా అమలు జరిగే విధంగా పాలన కొనసాగుతుందని అనేక అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు మండల దేశం పార్టీ అధ్యక్షుడు నంబాల వెంకట్రావు, మాజీ ఎంపీపీ సలాన మోహన్రావు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**మందస, జులై 7(వార్త):** వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాలను కూటమి ప్రభుత్వం సరిచేస్తుందని పలువురు వక్తలు అన్నారు. మందస మండలంలోని భోగాపురం, బేతాలాపురం గ్రామ పంచాయతీలలో పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన దారుణాలు చాలా ఉన్నాయని, అందులో కొన్ని చూసుకుంటే ప్రజల సొంత ఆస్తులను 22ఏ క్రింద పెట్టి వారు ఆ ఆస్తులను అమ్ముకోకుండా క్రయవిక్రయాలకు జరగకుండా నిషేధిత జాబితాలో పెట్టడం జరిగిందన్నారు. వ్యవసాయ భూములను, ఇళ్ల స్థలాలను దేవస్థాన భూములుగా చూపిస్తూ ఆ జాబితాలో పెట్టడం జరిగిందన్నారు. దీంతో ప్రజలందరూ ఆందోళన చెందడం జరిగిందని, నాటి ప్రభుత్వం ఈ భూములను స్వాహా చేసే ఉద్దేశంతో చేశారో లేక మరే ఉద్దేశ్యంతో చేశారో ఎవరికి అర్థం కావడంలేదన్నారు. వీటి బారి నుండి ప్రజలను రక్షించాలని, ప్రజల ఆస్తులకు హక్కు కల్పించాలన్న ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చంద్రబాబు నాయుడు గ్రామ సభలు పేరుతో రీ సర్వే జరిపించి ప్రజల నుండి అభ్యంతరాలు స్వీకరించి, విచారణ జరిపిన తర్వాత ముఖ్యమంత్రి 22ఏ జాబితాలో ఉన్న ప్రజల ఆస్తులను 22ఏ నుంచి తొలగించడం జరుగుతుందని తెలిపారు. మండలంలో చాలా మంది రైతులకు సంబంధించిన భూములను గత ప్రభుత్వం ఫ్రీ హోల్డ్ చేయించిదని, కూటమి ప్రభుత్వంలోఆ భూములకు విముక్తికలుగుతుందన్నారు. ఇళ్లకు సంబంధించిన స్థలాలను కూడా నిషేధం జాబితాలో పెట్టి వారిని మానసింగా వేధించారన్నారు. సంవత్సర కాలంగా సంక్షేమ కార్యక్రమాలు అభివృద్ధి కార్యక్రమాలు ఏ విధంగా చేసామో ప్రజలకు తెలియచెప్తున్నామని, ఎవరైనా ఇటువంటి ఇబ్బందుల్లో ఉన్నట్లయితే వారు అధికారులకు కానీ మాకు గాని తెలియ చేసినట్లయితే మరోసారి విచారణ చేయించి, ఆ భూములను కూడా నిషేధిత జాబితా నుండి తొలగించడం జరుగుతుందన్నారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్ తీసుకొచ్చి ప్రజలను ఇబ్బంది పెట్టారని, ఇటువంటి దుర్మార్గాలు చేసిన తర్వాత కూడా రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు వైఎస్సాఆర్సీపీ నాయకులు సంక్షేమ కార్యక్రమాలు గురించి ఏవేవో మాట్లాడుతున్నారన్నారు. ఆనాడు మీ నాయకుడు కొండలు, గుట్టలు మాయ చేయలేదా, సంక్షేమ పథకాలు ఏకపక్షంగా ఇచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందరికీ అందజేస్తున్నదని తెలిపారు. సుపరిపాలన అంటే ప్రజలకు సౌకర్యవంతంగా ఉండాలని, ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టడం సంక్షేమ రాజ్యం కాదన్నారు. జగన్మోహన్ రెడ్డి, ఇక్కడ మాజీ అప్పలరాజు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఇప్పుడు నీతి కబుర్లు చెబుతున్న ఆనాడు ఇటువంటి చట్టాలను తీసుకొచ్చినప్పుడు ఏం చేశారు? కనీస మర్యాద కూడా లేకుండా రైతుల బాధలు పట్టించుకోకుండా అక్కడ తానా అంటే ఇక్కడ తందానన్నట్లుగా ఆనాడు కార్యక్రమాలు నిర్వహించి ఇప్పుడు నీతులు మాట్లాడుతున్నారన్నారు. ప్రభుత్వం అనేది అభివృద్ధి చేయాలని, సంక్షేమం అందించాలని, సంపద సృష్టించాలని, ఆ విధంగా ముందుకు వెళుతూ ఈ ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిదిద్దుకుంటూ ముందుకు వెళుతూ సుపరిపాలన అందించేలా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు.

కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సాలిన మాధవరావు, క్లస్టర్ ఇంచార్జి ముంజేటి చంద్రశేఖర్, యూనిట్ ఇంచార్జిలు బమ్మిడి కర్రయ్య, దేబాసిస్ పండా, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు నవీన్ కుమార్ ఎమ్, రట్టి లింగరాజు, తమిరి భాస్కరరావు, అడ్డి ఈశ్వరరావు, దున్న తిరుపతి, బేతాలపురం ఎంపీటీసీ సురాడ వాసు, జుత్తు అప్పలస్వామి, చీకటి రవికుమార్, పులారి ధర్మారావు, సిద్దు, దున్న నారాయణ, బేసి ఈశ్వరరావు, అగ్గున్న శ్రీరాములు, పోలేటి ప్రభాకర్, పిట్ట దుదిష్టి, బాబులు బెహర పాల్గొన్నారు.





## ఘనంగా దాసన్న జన్మదిన వేడుకలు

**నరసన్నపేట, జులై 7(వార్త):** మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పుట్టినరోజు వేడుకలు నరసన్నపేటలో ఘనంగా జరిగాయి. నరసన్నపేట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రాంగణం జనం తో సందడిగా మారింది. నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాసన్న అభిమానులు ఆయన గైర్హాజరులో ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ, భారీ కేక్ కట్ చేశారు. ఆత్మీయతతో పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు, పార్టీ జెండాలతో, పెద్ద పెద్ద ఫ్లెక్సీలతో కార్యాలయం అలంకరించారు. 'దాసన్న'కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ నినాదాలు వేయడంతో పార్టీ కార్యాలయంలో సందడి వాతావరణం నెలకొంది. వేడుకల అనంతరం పార్టీ శ్రేణులు నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మానవతా సేవలకూ ప్రాధాన్యం ఇచ్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమాలతో మరింత ప్రత్యేకంగా మార్చారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ... ధర్మాన కృష్ణదాస్ ఆదర్శవంతమైన నాయకుడిగా, ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలిచే మానవతావాది అని కొనియాడారు. ఆయన రాజకీయ జీవితం ప్రజలకు నిలువెత్తు దార్శనికంగా నిలుస్తుందన్నారు. సేవా కార్యక్రమాలు చేపట్టిన కార్యకర్తలు, నేతల మంచి పనికి ఆసుపత్రి సిబ్బంది ప్రశంసించారు. చివరగా పార్టీ శ్రేణులు అన్ని మండలాల నుంచి వచ్చిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పీజీఆర్ఎస్‌కు 13 దరఖాస్తులు



**పలాస, జులై 7(వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీర్స్ )కార్యక్రమంలో ఆస్థి పన్ను పేరు మార్పు, డెత్ సర్టిఫికెట్లు, వితంతు పెన్షన్లు వంటి పలు సమస్యలపై మొత్తం 13 దరఖాస్తులు అందినట్లు పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు వెల్లడించారు. అందులో బర్త్ సర్టిఫికెట్ల కొరకు -3, డెత్ సర్టిఫికెట్లు కొరకు-04, పెన్షన్ లు కొరకు-3, ఆస్థి పన్ను పేరు మార్పు కొరకు-3 దరఖాస్తు అందినవి. ముఖ్యంగా టిడ్కో ఇండ్ల కొరకు ఉన్న సమస్యలు పై ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, ఈ విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, ప్రభుత్వం నుండి తగిన మార్గ దర్శకాలు వచ్చిన వెంటనే టిడ్కో ఇండ్ల దరఖాస్తులు పరిష్క రించడం జరుగుతుంది అని మున్సిపల్ కమిషనర్ తెలియజేసారు.

## భక్తి శ్రద్ధలతో మోహరం ప్రార్థనలు

**ఇచ్ఛాపురం, జులై 7(వార్త):** ముస్లిం సోదరులు అషూరా-ఎ-ముహర్రం పూజలను ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు.కర్బలాలో సత్యం, ధర్మం న్యాయాన్ని నిలబెట్టడం కోసం తమ ప్రాణాలను అర్పించిన ప్రవక్త ముహమ్మద్ మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ అతని సహచరుల బలిదానం చేసిన రోజు సందర్భంగా ఈ పూజలను నిర్వహిస్తారు. పట్టణంలోని కస్పా మసీదుకు సమీపంలో ఉన్న మౌలాలి పంజా వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్ద జోహార్ ఖాన్ మాట్లాడుతూ.. హజ్రత్ ఇమామ్ హుస్సేన్ తన నీతిపట్ల నిబద్ధతను తెలియజేసి, కష్టాల సమయంలో సత్యాన్ని నిలబెట్టడానికి ప్రజలకు స్ఫూర్తినిచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అబ్దుల్లా, అమీర్ అలీ, మున్నా, బషీర్, జుల్లు ఆలీ బక్రీ, యూసఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546